క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో విగ్రహ ప్రతి˜ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి చిలుకూరి దినకర శాస్త్రీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం దత్తాత్రేయ స్వామికి పుష్పాభిషేకం, అన్నాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, ముత్యాల రమణమూర్తి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పర్యటన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య గురువారం ఇల్లెందులో సుడిగాలి పర్యటన చేశారు. బాలాజీనగర్‌లో ఇటీవల అనారోగ్యంతో బల్లెం అనిల్ మృతి చెందగా సమాచారం అందుకున్న కనకయ్య వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. స్టేషన్ బస్తీకి చెందిన ఎన్డీ నేత దండు వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో ఈనెల 29న ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న మెగా జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

ఇల్లెందురూరల్: విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రం చేశారు. ఆయా పనులను గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కవిత, కార్యదర్శి సుస్మిత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



దుర్గాప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను గురువారం ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూలూరుపాడు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందించారు. రెండోసారి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై నందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాళోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, బానోత్ నవీన్ రాథోడ్, బోడా వీరు నాయక్, బానోత్ మంగు, నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, దంతలబోరు గ్రామపంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామాల్లో డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను మండల ఇన్‌చార్జ్ కాంపెల్లి కనకేష్ ప్రారంభించారు. మాట్లాడుతూ... గ్రామీణ క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్ప అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణ, నాలుగు పనుల ఖర్చుకు రూ.20 లక్షల పరిపాలన ఆమోదం కొరకు కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. వర్కర్లను ఎంగేజ్‌కు రూ.5లక్షలు, జేసీబీల ఎంగేజ్‌కు రూ.5 లక్షలు, ట్రాక్టర్లు, డోజర్ల కొరకు రూ.5లక్షలు, శానిటేషన్ పనుల కొరకు, సామగ్రి విడతల వారిగా కొనుగోలు చేయడానికి రూ.5 లక్షలు ఖర్చు కానున్నాయని చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు, కమిషనర్ రఘు, మేనేజర్ సత్యనారాయణ, టీపీఎస్ ప్రభాకర్, ఏఈ సాహితి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన బస్తీ దవాఖానాలు

20న ప్రారంభం

- ఒక్కో దవాఖానాకు రూ.10 లక్షల నిధులు
- ఇల్లెందు మున్సిపాలిటీలో పేదల ముంగిట ప్రజా వైద్యం



కొత్త కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా బస్తీ దవాఖానా

ఇల్లెందు: వైద్యం అత్యంత ఖరీదైన కాలంలో పేదలకు ప్రభుత్వ వైద్యం మినహా ప్రైవేట్ వైద్యం చేయించుకోలేని పరిస్థితి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తోంది. ఇల్లెందు పట్టణంలో దవాఖానాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇల్లెందు కొత్త కాలనీలో ఒకటి, ఎల్‌బీఎస్ నగర్ ప్రాథమిక పాఠశాలలో మరొకటి ఏర్పాటు చేశారు. కొత్త కాలనీలో హెల్త్ సబ్ సెంటర్ కోసం ఏర్పాటు చేసిన భవనంలో ఎల్‌బీఎస్ నగర్‌లో ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా మారిన స్కూల్ భవనానికి మరమ్మత్తులు చేసి మరో బస్తీ దవాఖానాలుగా మార్చారు. ప్రభుత్వం ఒక్కో బస్తీ దవాఖానాకు రూ.10 లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో అన్ని హంగులతో మరమ్మతులు చేసి రంగులు అద్ది విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా రూపుదిద్దుకుంటున్న బస్తీ దవాఖానలు ఈ నెల 20న ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

దవాఖానాలలో సిబ్బంది ఇలా ..

ఈ బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు, ఒక నర్సు అందుబాటులో ఉంటారు. రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు కూడా ఇస్తారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారు. నాటి సబ్ సెంటర్‌లే నేటి బస్తీ దవాఖానాలుగా మారుతున్నాయి.

పేదలకు అందనున్న మెరుగైన వైద్యం..

బస్తీ దవాఖానాల ద్వారా పేదలకు పలు రకాల ఆరోగ్య సేవలు అందనున్నాయి. ఓపీ, ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, టీకాలు, కుటుంబ నియంత్రణ కౌన్సెలింగ్, రక్తహీనత, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ బుధ, శని వారాల్లో చిన్నారులకు పోలియో, టీబీ, డీటీపీ టీకాలు వేస్తారు.



జేబీఎస్ బస్తీలో బస్తీ దవాఖానా



పనులను పరిశీలిస్తున్న రొంపేడు పీహెచ్‌సీ డాక్టర్ కవిత, కౌన్సిలర్ అనిత

ప్రారంభోత్సవానికి సిద్ధం...



ఇల్లెందు మున్సిపాలిటీలో రెండు బస్తీ దవాఖానాలు కార్పొరేట్‌ను తలదన్నేలా ముస్తాబయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో నేడో రేపో ఈ రెండు ప్రారంభం కానున్నాయి. కొత్త కాలనీ, జేబీఎస్‌లలోని ఈ రెండు దవాఖానా పనులు తుది దశకు చేరాయి. పేదలకు సకాలంలో వైద్యసహాయం అందించటమే ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా భవనం, విద్యుత్ సదుపాయం, మంచినీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటయ్యాయి.

– అంకుషావలీ, కమిషనర్, ఇల్లెందు మున్సిపాలిటీ

'డబుల్' లబ్ధిదారుల ఆందోళన



పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న మహిళలు

జూలూరుపాడు: డబుల్ బెడ్ రూం ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలో లబ్ధిదారుల ఆందోళన గురువారం కూడా కొనసాగింది. పలువురు మహిళలు పెట్రోల్ బాటిళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమ్లా తండాలో రాష్ట్ర ప్రభుత్వం 51 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిందని, మూడేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు లాటరీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కానీ ఇతరులు 14 మంది అక్రమంగా ఆ ఇళ్లల్లో నివాసం ఉంటున్నారని, అయినా వారిని ఖాళీ చేయించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారిని తక్షణమే ఖాళీ చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా ఇళ్లను మాకు అప్పగించకపోతే ఆత్మహత్య చేసుకోవడానికైనా వెనకాడమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ సొంత రెవెన్యూ గ్రామంలో తమకు న్యాయం జరగకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు కేటాయించిన ఇళ్లను అప్పగించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు భూక్యా శాంతి, ధరంసోత్ మాధవి, బోడా శారద, ధరావత్ మింది, భూక్యా వీరమ్మ, భూక్యా సరోజ, వాంకుడోత్ సావిత్రి, భూక్యా జమ్లీ, బోడా శిల్ప, గుగులోత్ పావని, గుగులోత్ రాజ్లీ, అజ్మీర సంధ్య, బానోత్ సాలీ పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చండి

ఇల్లెందు: కొన్ని రోజులుగా ఇల్లెందు ఏరియాలో ఎండలు తీవ్రత బాగా పెరిగింది. కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు, యంత్రాల్లో ఎండలకు మంటలు చెలరేగుతున్నాయి. తక్షణం సింగరేణిలో కార్మికుల పనివేళలు మార్చాలని బీఎంఎస్ ఉపాధ్యక్షుడు నాయిని సైదులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం 47 ఫిల్టర్‌బెడ్ వద్ద 3వ నంబర్ పంపు రిపేరు కోసం ఎస్కార్ట్ మిషనరీ బ్రేక్ టైంలో మంటలు వచ్చాయని తెలిపారు. అక్కడి సెక్యూరిటీ గార్డులు గమనించి తప్పుకోవటం వల్ల ప్రమాదం తప్పిందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల పనివేళలు మార్చాలని కోరారు.

షాదీఖానాకు స్థలం కేటాయింపు

ఇల్లెందు: పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ వెనుకనున్న సింగరేణి క్వార్టర్స్ స్థలాన్ని షాదీఖానాకు కేటాయించారు. ఎమ్మెల్యే హరిప్రియ ఆదేశాలతో తహసీల్దార్ కృష్ణవేణి గురువారం పంచానామా నిర్వహించి జిల్లా మైనార్టీ శాఖ అభివృద్ధి అధికారి(డీఎండబ్లూఓ) సంజీవరావుకు స్థలపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియను తన క్యాంపు కార్యాలయంలో కలిసి షాదీఖానా నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ముస్లింలు ఎన్నో ఏళ్లుగా షాదీఖానా కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా స్థలం లభించకపోగా తమ కోసం పట్టించుకోలేదని ఎమ్మెల్యే హరిప్రియ కృషితో తమకు షాదీఖానా నిర్మాణం అయ్యే అవకాశం లభించిందని మైనార్టీ నాయకులు కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్ తెలిపారు.



తహసీల్దార్ కృష్ణవేణి నుంచి భూమి పత్రాలు స్వీకరిస్తున్న సంజీవరావు

ఈ సందర్భంగా పట్టణంలోని మైనార్టీల తరుపున హరిప్రియకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, రబ్బానీ, మైనార్టీ పెద్దలు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల క్రీడా మైదానంలో మంగళ, బుధవారంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం అధికారులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. వాలీబాల్ పోటీల్లో తొగ్గూడెం ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, పాయాకారియానంబైల్ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. కబడ్డీ పోటీలో జగన్నాథపురం జట్టు ప్రథమ, నాగారం జట్టు ద్వితీయ, ఖోఖో పోటీల్లో నాగారం జట్టు క్రీడాకారులు ప్రథమ, రంగాపురం జట్టు ద్వితీయ బహుమతులను గెలుపొందారు. విజేతలకు తహసీల్దార్ రంగాప్రసాద్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ రంగా బహుమతులను ప్రదానం చేశారు.

అధికార మార్పిడితోనే అభివృద్ధి సాధ్యం

సుజాతనగర్: ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సర్వారం గ్రామ పంచాయతీ హలావత్ తండాలో గురువారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో అనేక గ్రామాలు కనీస సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని ఆరోపించారు. తాగునీరు, విద్య, వైద్యం, రహదారి, విద్యుత్ సౌకర్యాల కల్పనలో ఇంకా అనేక గ్రామాలు వెనకబడే ఉన్నాయన్నారు. అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ ఒక్కటే అనే విషయాన్ని పాలకులు వీడాలన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అధికార మార్పిడితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం పలువురు బీఎస్పీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పాయం శారద, ఇస్లావత్ రామ్, భూక్యా రజిత, బాణోత్ అచ్చమ్మ, జెర్పాల లీల, ప్రియాంక, భూక్యా రవి పాల్గొన్నారు.

సీఆర్‌పీలకు ట్యాబ్‌లు అందించాలి



డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం అందిస్తున్న చందర్‌లాల్

పాల్వంచ: పాఠశాల సముదాయాల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలతో పాటు, సీఆర్‌పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్)లకు ట్యాబ్‌లు అందించాలని ట్రైబల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భట్టు చందర్‌లాల్ కోరారు. గురువారం డీఈఓ సోమశేఖర శర్మను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఆర్‌పీలు ఎన్నో రకాల ఆన్‌లైన్ పనులు చేయాల్సి ఉంటుందని, అన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు అందుబాటులో లేక ఇబ్బందిగా ఉందన్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని కోరారు.

అసత్య ఆరోపణలు మానుకోండి



మాట్లాడుతున్న జాటోత్ కృష్ణ

జూలూరుపాడు: ఇటీవల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి రాజీనామా చేసి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలో చేరిన గోపాల్ రావుపై అసత్య, అర్థరహిత ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ అన్నారు. గురువారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ.. మా పార్టీలో చేరిన గోపాల్‌రావును టార్గెట్‌గా చేసుకొని ఆరోపణలు చేయడం తగదని, ఇది విప్లవకారుల లక్షణం కాదన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు వై.గోపాల్‌రావు, రాయల సిద్దు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని నర్సరీల పరిశీలన



రంగాపురం నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

పాల్వంచరూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను గురువారం ఎంపీడీఓ అప్పారావు సందర్శించారు. నర్సరీలో ఎన్ని మొక్కలను పెంచుతున్నారు..? అవి ఏ దశలో ఉన్నాయని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. రంగాపురం, నాగారంకాలనీ, జగన్నాథపురం, కేశవాపురం, బసవతారక కాలనీలోని నర్సరీలను పరిశీలించి మొక్కలను చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అంబేడ్కర్ భవనానికి భూమి పూజ

ఇల్లెందు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవించుకోవాలని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. గురువారం పట్టణంలోని 22వ వార్డులో రూ.2.15 కోట్లతో నిర్మించనున్న అంబేడ్కర్ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో రూ.1.15 కోట్లు మంజూరు కాగా ఆ నిధులు సరిపోవని ఇంజనీరింగ్ అధికారులు సూచించటంతో మరో రూ.కోటి డీఎంఎఫ్ నుంచి కేటాయించినట్లు తెలిపారు. అధికారులు సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, 22వ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్, మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ, ఏఈ శంకర్, కౌన్సిలర్లు సయ్యద్ ఆజమ్, లలిత శారద, సందా బిందు, కడకంచి పద్మ, చీమల సుజాత, జేకే శ్రీనివాస్, కుమ్మరి రవీందర్, తార, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్, బీఆర్ఎస్ నేతలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

చైర్మన్ లేకుండానే శంకుస్థాపన..

అంబేడ్కర్ భవన నిర్మాణ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హాజరు కాలేదు. ఖమ్మంలో ఓ శుభకార్యానికి వెళ్లటం వల్ల హాజరు కాలేదని బీఆర్ఎస్ శ్రేణులు, మున్సిపల్ చైర్మన్ డీవీ పేర్కొంటున్నప్పటికీ ఇందులో వాస్తవం లేదని మరికొందరు అంటున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సకాలంలో సమాచారం లేకపోవటం వల్లే హాజరు కాలేదని మరోవర్గం పేర్కొంటోంది. ఇదిలా ఉండగా అంబేడ్కర్ భవనానికి గతంలోనే భూమి పూజ జరిగిందని మళ్లీ భూమి పూజ చేశారని స్థానికులు అంటున్నారు.

పర్యావరణ దినోత్సవంపై అవగాహన



మాట్లాడుతున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: మానవాళి మనుగడను నాశనం చేసే ప్లాస్టిక్‌ను వాడరాదని, పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని జీఎం ఎం.షాలేమురాజు అన్నారు. గురువారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి వివరించారు. అందరూ పర్యావరణం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

వాతావరణం కలుషితం చేయరాదని, ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటుకోవాలని సూచించారు. నీరు, గాలి కలుషితం కాకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాసు, ఓసీ పీఓ బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు, హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ వ్యవస్థాపక నాయకుడు ఎంఎస్ రెడ్డి ప్రభుత్వాన్ని, బస్సు యజమానులను డిమాండ్ చేశారు. స్థానిక కొత్తగూడెం బస్టాండ్ గేట్ ఎదుట హైర్ బస్ డ్రైవర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు తక్కువ వేతనాలు ఉన్నాయని, కనీస వేతన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్మనెంట్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఒకటే అయినప్పుడు వేతనాలు ఎందుకు తేడాగా ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. యూనియన్లు పెట్టొద్దని, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయొద్దని ప్రభుత్వం కార్మికులపై నిర్బంధాలను ప్రయోగించి ఉద్యమాలను విచ్ఛిన్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.వీరన్న, భూక్యా రమేష్, జాకబ్, రెడ్డి, హైర్ బస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, నరసింహ, కోశాధికారి గిరిబాబు, శ్రీకాంత్, కల్యాణ్, పాషా, తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

వేసవి శిక్షణ తరగతుల ముగింపు



మాట్లాడుతున్న చార్వాక

పాల్వంచ: విద్యార్థులు చిన్నతనం నుంచి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చార్వాక అన్నారు. గురువారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడు రోజులుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా ఫన్ సైన్స్, మ్యాథ్స్ మేడ్ ఈజీ, మ్యాజిక్ మర్మం, ఓరిగామి పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్, ఆర్ట్, స్టోరీ టెల్లింగ్, చెస్ ఆడుదాం చలో.. ఇలా పలు రకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భగా జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాలు, స్వామీజీలు ప్రజలను ఏవిధంగా మోసం చేస్తారో మ్యాజిక్ ద్వారా వివరించారు. మూఢ నమ్మకాల బారిన పడి ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా దోపిడీకి గురికావద్దని, శాస్త్రీయ బద్ధంగా ఆలోచించి ఆచారణాత్మకంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలు, వీరస్వామి, హరి, బుచ్చిరాములు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించండి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి తెలిపారు. గురువారం వార్డులో స్థానికులకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను మున్సిపాలిటీ వారు పంపిణీ చేసిన డబ్బాలలో వేర్వేరుగా స్వచ్ఛ ఆటలో వేయాలని ప్రజలకు సూచించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, షబానా, జవాన్ రవి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



స్థానికులకు చెత్తడబ్బాలు అందజేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

అటెన్షన్ ప్లీజ్



బురద గుంతను పూడ్చరూ..

టేకులపల్లి మండల కేంద్రంలోని తహసీల్ ఆవరణలో బురద గుంత స్థానికలకు ఇబ్బందిగా మారింది. కార్యాలయం ఆవరణలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఉంది. దీని వృథా నీటితో ప్లాంట్ వెనక తహసీల్ సమీపంలో బురద గుంత ఏర్పడింది. డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. కార్యాలయానికి వచ్చేపోయే వారికి మురుగు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

\- టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : వి.ప్రశాంత్, కార్యదర్శి, గోలియాతండా పంచాయతీ
సెల్ నెంబర్: 8106602112